క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

కొందుర్గు: మండలంలోని ప్వతాపూర్‌లో గురువారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ ఏర్పడి వ్యవసాయబోర్లు నడవడం లేదని రైతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆశ్రయించడంతో ఆయన వెంటనే స్పందించి స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంజుల, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాకేశ్, రవి, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ, టై పంపిణీ



బ్యాండ్, షూ, టైలను పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం కాంగ్రెస్ నాయకుడు ఎండీ మున్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ, టైలతో పాటు పాఠశాలకు వంట సామగ్రి, బ్యాండ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, నాయకులు మల్లయ్య, వాహెబ్, సత్తిరెడ్డి, యాదయ్య, లక్ష్మయ్య, సయీద్, చెన్నయ్య, అంజద్, ఇమ్రాన్, శివ, పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



పాఠశాల సిబ్బందికి క్రీడా సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

షాబాద్: పేద విద్యార్థులకు దాతల ప్రోత్సాహం ఎంతో అవసరమని హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1984–85లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలలోని విద్యార్థులకు అన్ని రకాల క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దోస్వాడ నర్సింలు, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, నాగిరెడ్డి, గ్లోరీ, శోభారాణి, మొగులయ్య, బాలకృష్ణ, శీతాబాయి, లలిత, మంజుల, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి



పత్తి సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మద్దూరు: అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి వస్తుందని నోడల్ ఆఫీసర్ ఆమత అన్నారు. గురువారం మండల కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట పరిశోధన ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగుపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయడంతో కూలీల ఖర్చు, పంటకాలం తగ్గుతుందని, అదే సమయంలో దిగుబడి అధికంగా వస్తుందని పేర్కొన్నారు. యాంత్రీకరణ సాధ్యమవుతుందని, కావున రైతులు ఈ విధానంలో సాగు చేయాలని సూచించారు. ఈ పద్ధతితో గులాబీ రంగు పురుగు నుంచి పంటను కాపాడుకోవచ్చని, దీని నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చంద్రకాంత్, విజయ్, గౌతమ్, హరి, ఏఓ అరుణ, ఏఈఓ జోత్స్న, వాహిని, భార్గవ్, ప్రియాంక, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శునకాల బెడద.. ఉండదిక!

పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా ఎక్కడ పడితే అక్కడ శునకాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వీటి నుంచి తమను తాము రక్షించుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంకర్‌పల్లి మండలం, పట్టణంలో ఇప్పటివరకు చాలా మంది వీటి ద్వారా ఆస్పత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. శునకాల బారి నుంచి ప్రజలను రక్షించేలా మున్సిపాలిటీ వారు బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వారితో రెండేళ్ల కాలానికిగాను ఒప్పందం చేసుకున్నారు. శంకర్‌పల్లిలో శునకాల బెడదపై 'సాక్షి' కథనం.

– శంకర్‌పల్లి

- బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వారితో మున్సిపాలిటీ ఒప్పందం
- ఒక్కొక్క శునకానికి రూ.1650 చెల్లింపు
- ఇప్పటికి వరకు 190 కుక్కలకు ఆపరేషన్



ఆగష్టు 2న మొదటిసారి కుక్కలను తీసుకొని వెళ్తున్న బ్లూ క్రాస్ టీమ్(ఫైల్)

బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్‌తో ఎంఓయూ

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కుక్కల బెడదతో ప్రజలు రోడ్డుపై తిరగాలంటే జంకుతున్నారు. ఇప్పటికే పలువురు వీటితో ఆస్పత్రి పాలయ్యారు. కుక్కల బెడదను నివారించాలని, తమను రక్షించాలని కోరుతూ కమిషనర్, చైర్‌పర్సన్‌కు వందల కొద్ది వినతులు వచ్చాయి. దీనిపై అధ్యయనం చేసిన మున్సిపాలిటీవారు జూలై 26న బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వారితో రెండేళ్ల కాలానికిగాను ఎంఓయూ(మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం మున్సిపాలిటీలోని 550(అప్పటి లెక్కల ప్రకారం)కుక్కలను హైదరాబాద్‌లోని సంరక్షణ కేంద్రానికి తీసుకొని వెళ్లి ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్), ఏఆర్‌వీ(యాంటీ రేబీస్ వ్యాక్సిన్) టీకాలు ఇవ్వాలి. అనంతరం చికిత్స అందించిన కుక్కలకు చెవిపైన 'వి' (ෆ) ఆకారం(షేప్)లో కటింగ్ చేసి మళ్లీ పట్టణంలోనే వదిలేస్తారు. దీని కోసం బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వారు మున్సిపాలిటీ నుంచి ఒక్కొక్క కుక్కకు రూ.1650లు ఛార్జీగా వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ విధంగా 190 కుక్కలకు చికిత్స అందించి, మళ్లీ పట్టణంలోనే వదిలేశారు.

వ్యాధుల నుంచి రక్షణ, పునరుత్పత్తి నివారణ

కుక్కలకు చికిత్స అందించి, మళ్లీ పట్టణంలోనే వదిలేసిన తర్వాత ప్రజలకు ఎలాంటి వ్యాధులు (రేబీస్) సంక్రమించవు. అదే విధంగా ఆ శునకాలకు ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) చికిత్స అందించడం ద్వారా పునరుత్పత్తి జరిగే అవకాశం లేదు. దీంతో కుక్కల ఉత్పత్తిని ఆపడమే కాకుండా, వాటి నుంచి ప్రజలకు రక్షణ కలుగుతుందని మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు. ఏఆర్‌వీ టీకా కుక్కలకు ఇచ్చిన తర్వాత దాని వ్యాలిడిటీ ఏడాది కాలం ఉంటుందని, ఆపై మళ్లీ వారే టీకాలు ఇస్తారని తెలిపారు.

వారానికి 15–20 మాత్రమే తరలింపు

పట్టణంలోని కుక్కలకు చికిత్స, టీకాలను అందించేందుకుగాను బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వారు వారానికి 15 నుంచి 20 మాత్రమే తీసుకొని వెళ్తారు. అక్కడ ఏబీసీ, ఏఆర్‌వీ చికిత్సలు అందించిన తర్వాత, వాటికి సరిపడా రెస్ట్ ఇచ్చిన తర్వాతనే మళ్లీ పట్టణంలోకి తీసుకొచ్చి వదిలేస్తారు. పట్టణవాసులు తమ కాలనీల్లో కుక్కల బెడదను నియంత్రించాలని వినతులు ఇస్తున్నారని, ఇవన్నీ ఏం అవస రం లేదని, ప్రతీ చోట తీసుకొని వెళ్తారని, ఇది నిరంతర ప్రక్రియ అని కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.



బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంఓయూ చేసుకుంటున్న కమిషనర్ శ్రీనివాస్

సమస్యను పరిష్కరిస్తాం



నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ అయినప్పటికీ ప్రతీ సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నాం. శునకాల బెడద గురుంచి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏదైనా ఇబ్బందులు ఉంటే మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలి.

– విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, శంకర్‌పల్లి

ఏబీసీ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం



పట్టణంలో రూ.15లక్షలతో ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. స్థలం కోసం అన్వేషిస్తున్నాం. అది పూర్తయిన తర్వాత సెంటర్‌ను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తాం. శునకాల గురుంచి అన్నీ రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విడతల వారీగా సెంటర్‌కు పంపి, చికిత్స చేయిస్తున్నాం. ఎవరూ భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

కూలీలకు ఆహార భద్రత కల్పించాలి

- టీవీవీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: వ్యవసాయ కూలీలకు ఆహార భద్రతతో పాటు జీవనోపాధికి భద్రత కల్పించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టగళ్ళ వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం సంఘం నాయకులు ఆర్డీఓ వెంకటమాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మట్టగళ్ళ వెంకటయ్య మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా నేటికీ కూలీలు కూలీలుగానే ఉన్నారే తప్పా కనీసం వారు సొంత ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. దీనికి కారణం ప్రభుత్వాలేనన్నారు. అధికారం చేపట్టిన పాలకులు కూలీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారు కానీ వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. రెక్కాడితే కాని డొక్కాడని వ్యవసాయ కూలీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు కనీస వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవనోపాధికి భద్రత కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఇళ్లులేని వారికి ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వ్యవసాయ రంగం దానికి అనుబంధ రంగంలో పనిచేస్తున్న కూలీలను నైపుణ్య కూలీలుగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

జీవిత బీమాను సద్వినియోగం చేసుకోండి

బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము



లబ్ధిదారులకు బీమా పత్రాలు అందజేస్తున్న రాము

షాబాద్: ప్రధాని జీవిత బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రధాని జీవిత బీమా చేసుకున్న లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలకు దరఖాస్తులు చేసుకోవడంతో రూ.2లక్షల బీమా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమేశ్, నరేశ్, సాయి, ఎస్‌బీఐ సీఎస్పీ నిర్వాహకులు శివరాజ్‌గౌడ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



షాబాద్: మద్దూరులో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

శంకర్‌పల్లి: పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని శంకర్‌పల్లి, మహారాజ్‌పేట్ పశువైద్యులు మానసరెడ్డి, శ్రావణి అన్నారు. గురువారం వారు మండలంలోని మహారాజ్‌పేట్, కొండకల్, కొత్తగూడ, జన్వాడ, చిన్నశంకర్‌పల్లి, మహాలింగాపురం గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పశువుల్లో వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించాలన్నారు. గాలికుంటు సోకిన పశువుల్లో నోట్లో, గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయని, జ్వరం ఉండడంతో మేత మేయవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజ్యలక్ష్మి, శాంతమ్మ, సుప్రియా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మక్తగూడ, మద్దూరు గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు ఉన్నారు.



శంకర్‌పల్లి: మహారాజ్‌పేట్‌లో టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రావణి

నిందితులపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు



మాట్లాడుతున్న నాయకుడు అనంత్‌రెడ్డి, తదితరులు

చేవెళ్ల: దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిని, వీటిని ప్రేరేపిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉంటాయని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన బీజేపీ నాయకులు ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజనేయులుగౌడ్, మండల ఉపాధ్యక్షుడు దేవుని శర్వలింగం, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రాసేనారెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం, పోలీస్‌శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేవాలయాలు, హిందువులపై దాడులు పెరిగిపోవటం ఆందోళన కలిగిస్తోందన్నారు. హిందువులనే లక్ష్యంగా ఒక వర్గానికి చెందినవారు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మత ఘర్షణలు రేకెత్తించి అల్లర్లు సృష్టించాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ముత్యాలమ్మ దేవాలయంలో జరిగిన దాడిపై రాష్ట్ర మంత్రులు ఎవరూ స్పందించకపోవటం బాధాకరమన్నారు. హిందూ సమాజాన్ని, దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ హిందువుపై ఉందని తెలిపారు. హింసను ప్రేరేపించే వారిపై కూడా ప్రభుత్వం నిఘా పెట్టి కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి జయంతిలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘు, అధికారులు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొందుర్గు: మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన వాల్మీకి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ, ముంబై జట్లు తలపడ్డాయి. ఈ సందర్భంగా ముంబై జట్టు నిర్ణీత ఓవర్లలో 48 పరుగులు చేసి ఆలౌట్‌కాగా.. ఢిల్లీ జట్టు ఏడు వికెట్లు మిగిలి ఉండగానే లక్ష్యం ఛేదించి విజయం సాధించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేత జట్టుకు బహుమతులు అందజేశారు. విజేతలను స్థానికులు అభినందించారు.

విద్యార్థికి ఆర్థికసాయం



శ్రీకాంత్‌కు చెక్కు అందజేస్తున్న రాములు

ఆమనగల్లు: కాన్పూర్‌లో ఐఐటీ చదువుతున్న శ్రీకాంత్‌కు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు రూ.40వేలు ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధి శంకరకొండతండాకు చెందిన నిరుపేద విద్యార్థి నేనావత్ శ్రీకాంత్ ఐఐటీ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఆర్థిక సమస్యలతో రెండో సంవత్సరం ఫీజులు కట్టేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రాములు గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో విద్యార్థికి ఆర్థికసాయం చెక్కును అందజేశారు. చదువు పూర్తయ్యేవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మానయ్య, స్థానిక నాయకులు ఆంజనేయులు, నేనావత్ పత్యా, రాంజీ, శేఖర్‌రెడ్డి, జగ్రాం, చందునాయక్ తదితరులు ఉన్నారు.

రైతుభరోసా ఏమాయె?

- కమిటీలు, అభిప్రాయ సేకరణ పేరుతో హంగామా
- సీజన్ చివరి దశకు చేరినా అందని నగదు
- పెట్టుబడిసాయం కోసం రైతుల నిరీక్షణ
- ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వం



మల్లారెడ్డిగూడలో రైతులు సాగు చేసిన పత్తి పంట

షాబాద్: పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులకు గురికావొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. రెండు సీజన్‌లకు కలిపి ఎకరానికి రూ.10 వేల చొప్పున చెల్లించింది.రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతు భరోసా పథకం కింద రైతులకు ఎకరానికి రూ.15వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయాన్ని అందజేసింది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్య క్తులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైతుభరోసా పథకం అమలుకు ఇప్పటి వరకు ప్రభుత్వం మార్గదర్శకాలు కూడా విడుదల చేయలేదు.

మండలంలో 20,245 మంది రైతులు

మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు 20,254 మంది రైతులను గుర్తించారు. వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని పెంచి ఎకరానికి రూ.15వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సీజన్ ముగింపు దశకు చేరుకున్నా ఇప్పటివరకు ప్రభుత్వం పెట్టుబడిసాయం అందించటంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు సేకరించింది. సీజన్ ముగింపు దశకు చేరుకున్నా పెట్టుబడి సాయం కింద ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు.

రేపుమాపు అంటూ కాలయాపన

కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి రైతు భరోసా పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామంటూ ప్రకటనలు చేస్తుందే తప్పా దాన్ని అమలు చేయటం లేదు. దసరాలోపు ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందజేస్తుందని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు రైతుభరోసా పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కనీసం దీపావళీలోపు పెట్టుబడిసాయం అందిస్తే పంట కోతలకు ఉపయోగకరంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

అప్పు తీసుకొస్తున్నాం



పంటల సాగుకు పైసలు లేక పెట్టుబడుల కోసం బయటి వ్యక్తుల దగ్గర వడ్డీకి అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నాం. పంటల సాగు మొదలయ్యే సమయంలోనే ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా మార్గదర్శకాలు విడుదల చేసి వెంటనే పెట్టుబడి సాయాన్ని అందించాలి

– చంద్రబాబు, రైతు, షాబాద్

ఇంకెప్పుడు అందిస్తారు



వానాకాలం పంటల సాగు పూర్తయ్యే దశకు చేరుకుంది. అయినా ఇప్పటివరకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం పంపిణీ చేయలేదు. ఇంకా ఎప్పుడూ పంపిణీ చేస్తారు. పెట్టుబడి సాయం అనేది పంటల పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడేలా ఉండాలి.

– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్

సాగు పూర్తవుతుంది



ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి. గత ప్రభుత్వం ఒకటి, రెండు నెలలు ఆలస్యంగానైనా అందించేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు పెట్టుబడి సాయం మాత్రం అందించలేదు. రెండు నెలల్లో వానాకాలం సాగు పూర్తవుతుంది.

– రాపోల్ బాల్‌రాజ్, రైతు, మల్లారెడ్డిగూడ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564